క్లుప్తంగా

కోడి రామ్మూర్తి జీవితం ఆదర్శం



తెలగవీధిలో ఉన్న కోడి రామ్మూర్తినాయుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న బోధిహీన్

వీరఘట్టం: కలియుగ భీముడు, ఇండియన్ హెర్క్యులెస్, మల్లమార్తాండ కోడి రామ్మూర్తి నాయుడు జీవితం ఎందరికో ఆదర్శమని బౌద్ధ భిక్షువు బోధిహీన్ అన్నారు. శ్రీలంక నుంచి వీరఘట్టం వచ్చిన ఆయన వీరఘట్టం తెలగవీధిలో ఉన్న కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్మూర్తినాయుడు జన్మించిన ఇంటిని, తిరిగాడిన ప్రదేశాలను సందర్శించారు. ఇటువంటి మహానుభావునికి నివాళులు అర్పించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద, బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న రామ్మూర్తినాయుడు విగ్రహాలను సందర్శించారు. ఆయనతో పాటు స్థానికులు ఇట్లా మన్మధరావు, దొలూరు సత్యారావు, కోడి తాతబాబు, బల్లా హరిబాబు తదితరులున్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



మకర జ్యోతి దర్శనం వేళ పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

వీరఘట్టం: మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక శాస్తా సమాజంలో అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. శబరిమలలో మకర సంక్రాంతి రోజు అనగా మంగళవారం జ్యోతి దర్శనం ఇచ్చే సమయంలో వీరఘట్టంలో అదే సమయంలో స్వామి వారికి పూజలు చేసి శరణుఘోష చేసారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భరత్‌స్వామి, బుక్కూరు దుర్గారావు, అంబళ్ల గోపి, పొట్నూరు కోటి, తెంటు వెంకటరమణ, సీరాపు నాగరాజు, కర్రి తిరుపతిరావు, ఇట్లా శ్రీనివాసరావు, శంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న ఉసిరి



బొబ్బిలి రూరల్: కార్తీక మాసం నుంచి శీతాకాలం చివరి వరకు దొరికే అరుదైన ఫలం ఉసిరి. సి విటమిన్ నిండుగా ఉన్న ఉసిరికి కాయలో ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయని మన పెద్దలతో పాటు పురాణాలు, ఆయుర్వేద గ్రంథాల్లో దీని ప్రాముఖ్యతను వివరిస్తు ఎన్నో కథలు ఉన్నాయి. నేటి శాస్త్రవేత్తలు సైతం వైద్య రంగంలో ఉసిరిలో దాగి ఉన్న పోషకాలపై ఎన్నో పరిశోధనల ద్వారా మనకు తెలియజేస్తున్నారు. దీంతో నేడు ప్రస్తుతం ఉసిరి పంట రైతులకు సిరులు కురుపిస్తోంది. కేజీ ఉసిరి కాయలు 150 రూపాయిల వరకు బహిరంగ మార్కెట్లో ధర పలుకుతుండగా అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న ఉసిరి కాయలు నేడు మార్కెట్లో లభ్యం కావడంతో వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. చిన్న వయసులోనే నెరిసిపోతున్న తల నీలాలకు, దగ్గు, జలుబు వంటి జబ్బులకు ప్రాధమికంగా వాడే దివ్య ఔషధంగా వాడే ఉసిరి నేడు పట్టణ వాసులకు అందుబాటులో దొరుకుతోంది. బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వీటిని దిగుబడి చేసుకుంటున్న చిరు వ్యాపారులు వీటి అమ్మకాలతో మంచి ఆదాయం ఆర్జిస్తూ సంబరపడుతున్నారు.



బోనాలలో వేసేందుకు పెట్టిన నైవేద్యాలు



బోనాలతో వెళ్లేందుకు సిద్ధమైన మగవారు



బోనాలతో గుడివద్దకు చేరుకుని దేవతను కొలుస్తున్న భక్తులు

ఘనంగా బోనాల పండగ



బోనాలను తీసుకు వెళ్తున్నవారికి పూజలు చేస్తున్న భక్తులు



బోనాలను అలంకరించి నమస్కరిస్తున్న భక్తులు



బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు

బలిజిపేట: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు సజీవంగా ఉంటున్నాయి. దీనికి ప్రాంతీయభేదాలు లేవు. తెలంగాణలో నిర్వహిస్తున్న బోనాల పండగ ధోరణిలో ఆంధ్రాలో ఒక మారుమూల గ్రామంలో నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. బలిజిపేట మండలంలోని మిర్తివలస గ్రామంలో మూడు తరాల నుంచి సంప్రదాయంగా వస్తున్న బోనాల పండగను సంక్రాంతి పర్వదినాన నిర్వహించారు. ఈ గ్రామంలో తెలగజాతి వారు ఎక్కువగా నివసిస్తారు. వారిలో కుటుంబాల పరంగా గన్ను, గునపర్తి, మానం, శిగురుకోట, గంగు, గుండాపు వారు ఉన్నారు. వీరు కుటుంబాల పరంగా పేరంటాలను కొలుస్తారు. కానీ అందరికీ ఆరాధ్య దైవంగా ఉన్న ఎంకమ్మ పేరంటాలను భక్తిప్రపత్తులతో కొలుస్తారు. 5కుండలకు పసుపు, కుంకుమలు రాసి బొట్లు పెట్టి పూలతో అలంకరించి బోనాలుగా పిలుస్తారు. కుటుంబాలపరంగా వారివారి ఇళ్లలో వాటిని ఉంచి 5కుండలలో కలగాయకూర, పరమాణ్ణం, మైదాపిండి అట్లు, అరిసెలు, అంటిపండ్లు వేసి బోనాలను పూజించి వారి ఇళ్లనుంచి బయల్దేరి గ్రామం శివారున ఉన్న ఎంకమ్మపేరంటాలి గుడి వద్దకు వెళ్లి భక్తి ప్రపత్తులతో మొక్కి పూజలు చేశారు. బోనాలతో ఇంటినుంచి బయలుదేరేటపుడు ఇంటియజమానురాలు తలపై బోనాలను పెట్టుకోగా భర్త సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి అనుసరించాడు. బోనాలతో నడిచేవారి కాళ్ల కింద బట్టలు వేసి వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అటు వంటపుడు ఆ దంపతుల కాళ్ళు తాకుతూ వారిపై నుంచి దాటివెళ్తే ఎంతో పుణ్యమని భావించిన వారు నేలపై పడుకుని వారి ఆశీస్సులు పొందారు. వారిని దాటుకుంటూ బోనాలను దంపతులు గుడికి చేర్చారు. అక్కడ అందరూ కలిసి ఎంకమ్మపేరంటాలను మొక్కుకుని బోనాలలో ఉంచిన ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు. అక్కడే అన్నం, సాంబారుతో భోజనాలు చేసి వారి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుభకార్యాలు చేసేవారు ముందుగా పేరంటాలను కొలిచిన తరువాతే శుభకార్యాలు జరిపిస్తారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

మంచి సేవలకు గుర్తింపు



రామారావు మాస్టారును సన్మానిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గొంగాడ రామారావు మాస్టారును బడేవలస గ్రామస్తులు సంక్రాంతి సందర్భంగా ఘనంగా సన్మానించారు. బడేవలస గ్రామానికి చెందిన గొంగాడ రామారావు మక్కువ మండలం వెంకంపేటలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మంచి సేవలకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇటువంటి అవార్డులు ఆవ్యక్తికే కాకుండా వారి జన్మస్థలం బడేవలసకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చాయన్నారు. ఆయన ఆదర్శంతో యువకులు మంచి సేవలు అందించి అందరి మన్ననలు పొంది, గ్రామానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని పెద్దలు కోరారు. కార్యక్రమంలో గంట సింహాచలం, ఉపసర్పంచ్ జి.రామలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గొంగాడ కృష్ణ, జి.సత్యనారాయణ, డి.సత్యనారాయణ, ఎం.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారికి సన్మానం



మణికృష్ణను సన్మానిస్తున్న నడిమికెల్ల గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల పాఠశాలలో చదువుకుని నేడు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉద్యోగం సాధించిన కె.మణికృష్ణను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కోయంబత్తూరులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చిన మణికృష్ణను సంక్రాంతి సందర్భంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధించవచ్చునని మణికృష్ణ రుజువు చేసారని గ్రామ సర్పంచ్ డోకల సుజాతాశ్రీనివాస్ అన్నారు.

అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన పోలమాంబ అమ్మవారి ఆలయం



పోలమాంబ అమ్మవారు



చదురుగుడిలో అమ్మవారి ఘటాలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు బుధవారం పోటెత్తారు. ఈనెల13వతేదిన అమ్మవారు చదురుగుడికి చేరుకుని, ఆలయంలో కొలువై ఉన్నారు. మంగళవారం కాళ్ల నొప్పుల కారణంగా, విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగకు వారి వారి గ్రామాలుకు చేరుకున్నారు. తిరిగి వారు నివాసముంటున్న ప్రాంతాలకు వెళ్లే మందు పోలమాంబ అమ్మవారిని దర్శించుకుందామన్న ఆశతో భక్తులు తరలివచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



పెదపెంకిలో పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పెదపెంకి గ్రామంలో 80 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చీకటి చిన్నారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వాటిని పంపిణీ చేశారు. గ్రామంలో ఉండే నిరుపేదలకు ఒకొక్కరికి ఒక రగ్గును అందజేశారు. గడిచిన 15సంవత్సరాల నుంచి ఈ విధంగా సంక్రాంతికి నిరుపేదలకు వస్త్రదానం చేయడం ఎంతో గొప్ప విషయమని గ్రామస్తులు దాతలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, చీకటి గోపాల్‌నాయుడు, లక్ష్మణ్‌నాయుడు, అప్పలనాయుడు, జి.అప్పలనాయుడు మాస్టారు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



సవరకోటపాడు కల్చరల్ అండ్ అడ్వంచర్ పార్క్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



సవరకోటపాడులోని చిన్నారుల పార్క్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



తాడికొండ మొగనాళి గెడ్డలో పర్యాటకుల సందడి

సంక్రాంతి నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని పర్యాటక ప్రదేశాలైన తాడికొండ మొగనాళి గెడ్డ జలపాతంతో పాటు సవర కోటపాడులో గల కల్చరల్ అండ్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి బుధవారం నెలకొంది. సుదూర ప్రాంతాలతో పాటు స్థానికంగా విచ్చేసిన పర్యాటకులు పెద్దలు మొదలుకొని పిన్నల వరకు కుటుంబాలతో కలసి వీక్షిస్తూ సరదాగా గడిపారు. జలపాతంతో పాటు బోటు షికారు చేస్తూ కేరింతలతో ఆనందాన్ని పంచుకున్నారు. సంక్రాంతి సందర్భంలో పిల్లా పాపలతో సరదాగా గడపడానికి కుటుంబాలతో పెద్దమొత్తంలో పర్యాటకులు విచ్చేయడంతో పర్యాటక ప్రదేశాలన్నీ కలకలలాడాయి. - గుమ్మలక్ష్మీపురం







గ్రామాల్లో రంగవల్లులు

ఉత్సాహంగా సంక్రాంతి

పార్వతీపురం టౌన్: తెలుగు లోగిళ్లలో పెద్ద పండగైన సంక్రాంతి ఉత్సాహంగా..కనుమ ఉల్లాసంగా జరిగాయి. జిల్లా కేంద్రం, గ్రామాల్లో పండగ వాతావరణం స్పష్టంగా కనిపించింది. మహిళలు రంగవల్లుల పోటీలతో అలరించగా, యువత పలు క్రీడలతో సందడి చేశారు. ప్రజలంతా తమ కుటుంబసభ్యులతో విందు ఆరగించి ఆనందంగా గడిపారు. మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో వింజమ్మ జాతరను ఘనంగా నిర్వహించుకున్నారు.

ఇంటింట రంగవల్లుల సందడి

సీతానగరం: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజలు ప్రతి ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది నిష్టతో మూల దేవుళ్లను పూజించారు. ప్రతి ఇంటి వాకిల్లో వివిధ రకాల రంగులతో రంగవల్లులు తీర్చిదిద్దారు.



సంగంవలసలో మెట్టపై సంక్రాంతి సందడి

సంక్రాంతి సంబరాలు



బూర్జలో ట్రాక్టర్‌తో వీధుల్లో ప్రజలకు అభివాదం చేసిన డాక్టర్ జగన్‌మోహన్ రావు

సీతానగరం: మండలంలో సంక్రాంతి సంబరాలు సాదాసీదాగా జరిగాయి.ఈ మేరకు బూర్జలో వైద్యారోగ్యశాఖ ప్రొగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహన్‌రావు బంధుమిత్రులతో కలిసి బుధవారం జరుపుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణ చేసిన పిల్లలు ఆటపాటలతో కనువిందు చేశారు. డాక్టర్ టి.జగన్మోహన్‌రావు రైతు వేషధారణలో ట్రాక్టర్‌తో పురవీధుల్లో తిరిగుతూ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాల్య స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వీరఘట్టం:

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు .సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చిన వీరంతా హైస్కూల్ ప్రాంగణంలో ఇలా కలుసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. సుమారు 36 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం చెప్పలేని ఆనందాన్ని ఇచ్చిందని వారన్నారు.



గ్రామాల్లో తప్పెట గుళ్ళు సందడి



గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం



బూర్జలో చావిడిలో వివిధ రకాలపూలతో వేసిన రంగవల్లి



సుంకరివీధిలో ఇంటిముందు మహిళలు వేసిన రంగవల్లి